క్లుప్తంగా

జిల్లా స్థాయి పోటీలకు 53 మంది ఎంపిక

నడిగూడెం : మండల కేంద్రంలో గత మూడు రోజులుగా నిర్వహించిన మండల స్థాయి సీఎం కప్‌- 2023 క్రీడా పోటీలలో 53 మంది జిల్లా స్థాయికి ఎంపికైనట్లు ఎంపీడీఓ యం.యర్రయ్య శనివారం విలేకరులకు తెలిపారు. త్వరలో నిర్వహించనున్న జిల్లా స్థాయి పోటీలలో వీరు పాల్గొననున్నట్లు పేర్కొన్నారు. గ్రామీణ క్రీడాకారుల లో నైపుణ్యాన్ని వెలికితీసేందుకు ఈ పోటీలు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు.

ఘనంగా మరియమాత ఆలయ వార్షికోత్సవం

మేళ్లచెరువు : మండల కేంద్రంలోని మరియ మాత దేవాలయ వార్షికోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బాలయేసు, వేళాంగిణిమాత, మథర్‌ థెరిస్సా స్వరూపాలతో వీధుల్లో తేరు ప్రదర్శన నిర్వహించారు. సమష్టి దివ్యబలి పూజ సమర్పణ వంటి కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఫాదర్‌ ఇన్నారెడ్డి, చిన్నప్ప, వీరారెడ్డి, అంకరాజు, రామారావు, బాలస్వామి, ప్రసాద్‌, రవి తదితరులు పాల్గొన్నారు.

వీఆర్‌ఏల హర్షం



కోదాడలో కేసీఆర్‌ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న వీఆర్‌ఏలు

కోదాడరూరల్‌ : తమ ఉద్యోగాలను రెగ్యులరైజ్‌ చేస్తూ మంత్రి వర్గ సమావేశంలో సీఎం కేసీఆర్‌ తీసుకున్న నిర్ణయం పట్ల వీఆర్‌ఏలు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా శనివారం తహసీల్దార్‌ కార్యాలయం వద్ద సీఎం కేసీఆర్‌ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. తమను రెవెన్యూ శాఖలోనే కొనసాగించాలని వారు కోరారు. కార్యక్రమంలో శేఖర్‌, వీరబాబు, హరి, అమల, స్నేహలత ఉన్నారు.

కులగణన చేపట్టాలి

హుజూర్‌నగర్‌ : జనగణనలో కుల గణన చేపట్టాలని బీసీ ఉద్యమనేత ధనుంజయ నాయుడు శనివారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని కోరారు. బీసీ జనగణన చేస్తే జనాభా దామాషా ప్రకారం ఉద్యోగాల్లో, రాజకీయ పదవుల్లో తమ వాటా తమకు కావాలని బీసీలు అడుగుతారనే భయంతో వాయిదా వేస్తున్నారని ఆయన ఆరోపించారు. ఇది అత్యంత అమానుషమైన విషయమని అన్నారు.

దుర్గకు పలువురి నివాళి

కోదాడరూరల్‌ : మండల పరిధిలోని గణపవరంలో కోదాడ పీఏసీఎస్‌ డైరెక్టర్‌ చంద్రమౌళి కుమార్తె దుర్గ శనివారం అకాల మరణం చెందారు. ఆమె మృతదేహాన్ని పలు పార్టీ నాయకులు సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆమె కుటుంబ సభ్యులను ఓదార్చారు. నివాళులర్పించిన వారిలో కాంగ్రెస్‌ పార్టీ మండల అధ్యక్షుడు తూమాటి వరప్రసాద్‌రెడ్డి, సర్పంచ్‌ పొట్టా శ్రీవిజయకిరణ్‌, పీఏసీఎస్‌ చైర్మన్‌ ఆవుల రామారావు, ఓరుగంటి శ్రీనివాసరెడ్డి, ఇర్ల సీతరాంరెడ్డి, రాంరెడ్డి, సుభాష్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

ఇంటింటికీ తెలుగుదేశం




సభ్యత్వం అందజేస్తున్న టీడీపీ నాయకులు

చిలుకూరు : మండలంలోని పోలేనిగూడెం గ్రామంలో శనివారం ఇంటింటికీ తెలుగుదేశం కార్యక్రమంలో భాగంగా ఆ పార్టీ నాయకులు ఇంటింటికి తిరుగుతూ పార్టీ సభ్యత్వాన్ని అందజేశారు. టీడీపీ హయాంలో జరిగిన అభివృద్ధిని తెలియజేశారు. కార్యక్రమంలో పార్టీ కోదాడ నియోజకవర్గ కోఆర్డినేటర్‌ ఓరుగంటి ప్రభాకర్‌, పార్టీ మండల నాయకులు కొల్లు నర్సయ్య, దొడ్డా గురవయ్య, అమరారపు శ్రీమన్నారాయణ, మండవ కోటయ్య, బాదె రామయ్య, వెంకటయ్య, చంద్రయ్య, వెంకటనారాయణ, చిన బాబు, వెంకన్న, కోటేశ్వరరావు, అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తలకు ధన్యవాదాలు

హుజూర్‌నగర్‌ : నల్లగొండ ఎంపీ ఉత్తమ్‌కుమార్‌ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే పద్మావతి ముఖ్య అతిథులుగా హుజూర్‌నగర్‌లో నిర్వహించిన శాసన సభ ఎన్నికల సన్నాహక సమావేశాన్ని విజయవంతం చేసిన వారందరికి కాంగ్రెస్‌ పట్టణ అధ్యక్షుడు తన్నీరు మల్లికార్జున్‌ కృతజ్ఞతలు తెలిపారు. శనివారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ సమావేశం విజయవంతానికి కృషి చేసిన నియోజకవర్గ కాంగ్రెస్‌ ముఖ్య నాయకులకు, కార్యకర్తలకు ధన్యవాదాలు తెలిపారు.

గీత కార్మికుడు మృతి



చిన పిచ్చయ్య (ఫైల్‌)

చిలుకూరు : చిలుకూరు గ్రామానికి చెందిన గీత కార్మికుడు, సీపీఐ సీనియర్‌ నాయకుడు కొండా చిన పిచ్చయ్య (65) శనివారం అనారోగ్యంతో మృతి చెందారు. ఆయన గత కొన్నేళ్లుగా గీత కార్మిక సంఘం నాయకుడిగా, సీపీఐ నాయకుడిగా పని చేశారు. ఆయన మృతి పట్ల గీత పనివారాల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కొండా కోటయ్య, పలు పార్టీల నాయకులు సంతాపం వ్యక్తం చేశారు. ఆయన మృతి పార్టీకి తీరని లోటని అన్నారు.

ఆదమరిస్తే అంతే సంగతులు

- శిథిలావస్థలో ముక్త్యాల బ్రాంచ్‌ కెనాల్‌పై బ్రిడ్జి
- బ్రిడ్జిపై గుంత ఏర్పడి 8 నెలలైనా మరమ్మతులు చేపట్టని అధికారులు
- బిక్కుబిక్కుమంటూ ప్రయాణిస్తున్న వాహనదారులు



ముక్త్యాల బ్రాంచ్‌ కెనాల్‌ బ్రిడ్జిపై ప్రమాదకరంగా గుంత

హుజూర్‌నగర్‌రూరల్‌ : హుజూర్‌నగర్‌ బైపాస్‌ రోడ్డు నుంచి వేపలసింగారం గ్రామానికి వెళ్లే దారిలో ముక్త్యాల బ్రాంచ్‌ కెనాల్‌పై ఉన్న బ్రిడ్జి ప్రమాదకరంగా మారింది. బ్రిడ్జి శిథిలావస్థకు చేరి మధ్యలో కుంగిపోయింది. గత 8 నెలల క్రితం బ్రిడ్జిపై పెద్ద గుంత ఏర్పడింది. దీంతో అధికారులు ఆ గుంతపై ముళ్లకంపతో పాటు ఓ కర్రకు ఎర్ర గుడ్డముక్క కట్టి పాతిపెట్టి చేతులు దులుపుకున్నారు. నెలలు గడుస్తున్నా బ్రిడ్జి మరమ్మతుల గురించి పట్టించుకోవడం లేదు. దీంతో రాత్రి సమయంలో ఎవరైనా కొత్త వ్యక్తులు ఈ రహదారిపై అదమరిచి ప్రయాణిస్తే ప్రమాదల బారిన పడే అవకాశం ఉందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రాత్రి సమయంలో అటుగా వెళ్లే వాహనదారులు బిక్కుబిక్కుమంటూ వెళ్లాల్సిన పరిస్థితి నెలకొందని అంటున్నారు. నిత్యం భారీ వాహనాలతో రద్దీగా ఉండే ఈ రహదారిలో ఉన్న బ్రిడ్జిపై ఉన్న గుంతతో పెద్ద ప్రమాదం పొంచి ఉన్నప్పటికీ అధికారులు చోద్యం చూస్తున్నారని ఆరోపిస్తున్నారు.

సిమెంట్‌ లారీల రాకపోకలు..

హుజూర్‌నగర్‌ పట్టణం నుంచి ప్రతిరోజు సమీపంలోని మెళ్లచెరువు, చింతలపాలెం మండలాలకు రాకపోకలు కొనసాగిస్తుంటాయి. ఇక్కటి నుంచే ఆ మండలాల్లో ఉన్న సిమెంట్‌ పరిశ్రమలకు వందల సంఖ్యలో లారీలు ఎగుమతి, దిగుమతులు చేస్తుంటాయి. అయినా అధికారులు పట్టించుకోవడం లేదు. ఏమాత్రం ఏమరుపాటుగా ఉన్నా ప్రమాదం జరిగి ప్రాణాలు మీదకు వచ్చే అవకాశం ఉందని పలుమార్లు స్థానికులు తెలియజేసినప్పటికీ బ్రిడ్జికి కనీస మరమ్మతులు చేపట్టడం లేదని ప్రయాణికులు, ద్విచక్రవాహనదారులు అధికారులపై అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా బ్రిడ్జికి పూర్తిస్థాయిలో మరమ్మతులు చేపట్టాలని మండల ప్రజలు డిమాండ్‌ చేస్తున్నారు.

ప్రమాదం పొంచి ఉంది



హుజూర్‌నగర్‌ నుంచి మేళ్లచెరువు దారిలో ముక్త్యాల బ్రాంచ్‌ కెనాల్‌పై ఉన్న బిడ్జి శిథిలావస్థకు చేరి బ్రిడ్జిపై పెద్ద గుంత ఏర్పడింది. రాత్రి సమయంలో ఈ గుంతలో పడి ఎవరికి ఏ ప్రమాదం జరుగుతుందోనని భయంగా ఉంది. అధికారులు తక్షణమే స్పందించి నూతన బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలి.

– చడపంగు ఉదయ్‌భాస్కర్‌, వేపలసింగారం

ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాం



హుజూర్‌నగర్‌ బైపాస్‌ రోడ్డు నుంచి మేళ్లచెరువు వెళ్లే రహదారిలో ముక్త్యాల బ్రాంచ్‌ కెనాల్‌ బ్రిడ్జ్‌ శిథిలావస్థకు చేరిన మాట వాస్తవమే. ప్రమాదాలు జరగకుండా గుంత వాహనదారులకు కనిపించే విధంగా డెంజర్‌ గుర్తులు ఏర్పాటు చేశాం. ఈ బ్రిడ్జి నిర్మాణం చేపట్టడానికి ఉన్నతాధికారుల ద్వారా ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాం. త్వరలో నూతన బ్రిడ్జి నిర్మాణం చేపడతాం.

– తుమ్మల శ్రీనివాస్‌, ఇరిగేషన్‌ ఏఈ, హుజూర్‌నగర్‌

హామీల అమలులో కేసీఆర్‌ విఫలం



సమావేశంలో మాట్లాడుతున్న తాళ్ల నరేందర్‌రెడ్డి

నేరేడుచర్ల : ఎన్నికల్లో రైతులకు ఇచ్చిన హామీలో భాగంగా రుణమాఫీని తక్షణమే అమలు చేయాలని బీజేపీ కిసాన్‌ మోర్చా పట్టణ అధ్యక్షుడు తాళ్ల నరేందర్‌రెడ్డి డిమాండ్‌ చేశారు. శనివారం స్థానిక బీజేపీ కార్యాలయంలో జరిగిన కిసాన్‌ మోర్చా సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఎలాంటి హంగు ఆర్భాటాలు లేకుండా ఖరీఫ్‌ సీజన్‌లో ఎరువుల కోసం లక్షల కోట్ల రూపాయల సబ్సిడీ ప్రకటించారన్నారు. 2018లో రైతులకు రుణ మాఫీ చేస్తామని ప్రకటించి ఆరేళ్లు అవుతున్నా నేటికీ ఆ వాగ్దానాన్ని అమలు చేయడంలో పూర్తిగా కేసీఆర్‌ విఫలమయ్యారని ఆరోపించారు. రుణాలు చెల్లిస్తేనే బ్యాంకుల్లో అప్పులు ఇస్తామని అంటున్నారని, రుణాలు మాఫీ కాకపోవడంతో వడ్డీలు పెరిగిపోతున్నాయన్నారు. రైతులకు రుణమాఫీ చేయకుంటే వచ్చే ఎన్నికల్లో కేసీఆర్‌ నిరంకుశ పాలనకు చరమగీతం పాడుతామన్నారు. అలాగే వానాకాలంలో రైతులకు విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉంచాలన్నారు. సమావేశంలో నాయకులు సంకల మద్ది సత్యనారాయణరెడ్డి, బాల వెంకటేశ్వర్లు, కొణతం నాగిరెడ్డి, కాల్వ సైదులు, దేవిరెడ్డి నాగిరెడ్డి, కడియం సతీష్‌ తదితరులు ఉన్నారు.

ఎమ్మెల్యే కిషోర్‌ దళితులకు క్షమాపణ చెప్పాలి



సమావేశంలో మాట్లాడుతున్న దళిత సంఘాల నాయకులు

హుజూర్‌నగర్‌ : ఆత్మీయ సమ్మేళన సభలో దళితులను కించపరిచేలా మాట్లాడిన ఎమ్మెల్యే గాదరి కిషోర్‌ దళితులకు క్షమాపణ చెప్పాలని అఖిలపక్ష, దళిత సంఘాల నాయకులు డిమాండ్‌ చేశారు. శనివారం హుజూర్‌నగర్‌లో వారు విలేకరులతో మాట్లాడారు. ఎమ్మెల్యే స్థాయిలో ఉండి దళితులను కించపరిచేలా మాట్లాడిన కిషోర్‌కు ఎమ్మెల్యేగా కొనసాగే అర్హత లేదన్నారు. ఆ పదవికి రాజీనామా చేయాలన్నారు. కార్యక్రమంలో వివిధ పార్టీల, దళిత సంఘాల నాయకులు సీహెచ్‌.బాలచంద్రుడు, మంద రవి, బి.బాబు, కె.శ్రవణ్‌, ఎం.వెంకటేశ్వర్లు, ఎం.మట్టపల్లి, ఎం.రమణ, బి.ప్రసాద్‌, ఏసు, సోమయ్య తదితరులు పాల్గొన్నారు.

ఇళ్లు కోల్పోయిన నిరుపేదలను ఆదుకోవాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న సీపీఎం నాయకులు

మోతె : ఇటీవల మండలంలోని కురిసిన అకాల వర్షాలు, ఈదురుగాలులకు ఇళ్లు కోల్పోయిన నిరుపేదలకు ప్రభుత్వం ఇళ్లు నిర్మించి ఆదుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు మట్టిపెల్లి సైదులు ప్రభుత్వాన్ని డిమాండ్‌ చేశారు. శనివారం మండల పరిధిలోని రాఘవాపురం గ్రామంలో నిర్వహించిన సీపీఎం మండల కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇటీవల కురిసిన అకాల వర్షానికి చెట్లు విరిగి రాంపురం గ్రామంలో పలువురి ఇళ్లపై పడడంతో ఇళ్లు కూలినాయన్నారు. ప్రభుత్వ అధికారులు గ్రామాన్ని సందర్శించి జరిగిన నష్టాన్ని అంచనా వేసి ఇళ్లు కూలిపోయిన వారికి ఇళ్లు నిర్మించి ఇవ్వాలని, ఇళ్లు పాక్షికంగా కూలిపోయిన వాటికి నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్‌ చేశారు. ఈమేరకు పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని మండల తహసీల్దార్‌ యాదగిరికి అందించారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు వెలుగు మధు, ఆంగోతు పొట్టి, కొర్ర చిలకమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ కూలీలకు ఓఆర్‌ఎస్‌ ప్యాకెట్ల పంపిణీ



ఉపాధి హామీ కూలీలకు ఓఆర్‌ఎస్‌ ప్యాకెట్లు పంపిణీ చేస్తున్న ఎంపీడీఓ, ఎంపీఓ

మఠంపల్లి : మండలంలోని లాలితండా, కొత్తతండా, అల్లీపురం తదితర గ్రామాలలో మినీ పల్లె వెలుగు కార్యక్రమంలో భాగంగా నర్సరీలు, పారిశుద్ధ్య పనులను శనివారం ఎంపీడీఓ మామిడి జానకిరాములు పరిశీలించారు. అనంతరం ఎండ వేడిమి నుంచి ఉపశమనానికి లాలితండాలో ఉపాధి హామీ కూలీలకు ఓఆర్‌ఎస్‌ ప్యాకెట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీఓ ఆంజనేయులు, సర్పంచ్‌లు బోడి రమేష్‌, బాలానాయక్‌, కోలపూడి వెంకయ్య, కార్యదర్శులు నరేందర్‌రెడ్డి, ఉమ, తదితరులు ఉన్నారు.

పీఏసీఎస్‌ నూతన కార్యాలయం పరిశీలన

కోదాడరూరల్‌ : మండల పరిధిలోని ఎర్రవరంలో నిర్మించిన పీఏసీఎస్‌ నూతన కార్యాలయ భవనం, అగ్రి అవుట్‌లెట్‌ను నాబార్డు, కోఆపరేటివ్‌ అధికారులు శనివారం పరిశీలించారు. నూతన కార్యాలయ నాణ్యతను పరిశీలించారు. అక్కడ రైతులకు అందుతున్న సేవల గురించి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సహకార సంఘాల ద్వారా అందజేస్తున్న రుణాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. అయితే నూతన భవనంతో పాటు గోడౌన్‌ నిర్మాణ పనులు పూర్తి అయిన వాటిని నేటివరకు అధికారంగా ప్రారంభించలేదు కానీ వాటిలో కార్యకలాపాలు కొనసాగిస్తున్నారు. కార్యక్రమంలో చైర్మన్‌ నలజాల శ్రీనివాసరావు, మేనేజర్‌ సుధాకర్‌, సూపర్‌వైజర్‌ వెంకటనారాయణ, సిబ్బంది ఉన్నారు.



పీఏసీఎస్‌ కార్యాలయాన్ని పరిశీలిస్తున్న నాబార్డు, కోఆపరేటివ్‌ అధికారులు

ఆర్‌ఆర్‌ఆర్‌ కేంద్రాలు ఏర్పాటు



చెత్త సేకరణ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న మున్సిపల్‌ కమిషనర్‌ ఎస్‌.వెంకటేశ్వర్లు

నేరేడుచర్ల : మేరీ లైఫ్‌ మేరా స్వచ్ఛ్‌ షహర్‌ కార్యక్రమంలో భాగంగా శనివారం నేరేడుచర్ల మున్సిపాలిటీలోని ఏడు వార్డులలో రెడ్యూస్‌, రీసైకిల్‌, రీయూస్‌ కేంద్రాలను మున్సిపల్‌ కమిషనర్‌ ఎస్‌.వెంకటేశ్వర్లు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్లాస్టిక్‌ వస్తువులు, పాత దుస్తులు, పాత పదరక్షలు, నిరుపయోగంగా ఉండే బొమ్మలను కేజీ రూ. 5 చొప్పున కొనుగోలు చేస్తున్నామన్నారు. ఈ అవకాశాన్ని పట్టణ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు తాళ్లూరి సాయి, బచ్చలకూరి ప్రకాశ్‌, మేనేజర్‌ అశోక్‌రెడ్డి, మెప్మా సిబ్బంది, పారిశుద్ధ్య సిబ్బంది ఉన్నారు.

పారిశుద్ధ్య సమస్యలు పరిష్కరించాలి



నడిగూడెంలో పారిశుద్ధ్య పనులను పరిశీలిస్తున్న డీఎల్‌పీఓ శ్రీరాములు

నడిగూడెం : గ్రామాల్లో పారిశుద్ధ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని డీఎల్‌పీఓ శ్రీరాములు కోరారు. శనివారం ఆయన మండల పరిషత్‌ కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం మండల కేంద్రంలో పారిశుద్ధ పనులను పరిశీలించి సంబంధిత అధికారులతో మాట్లాడారు. ఆయన వెంట ఎంపీపీ యాతాకుల జ్యోతి, తహసీల్దార్‌ టి.నాగేశ్వరరావు, ఎంపీడీఓ యం.యర్రయ్య, ఎంపీఓ ఎర్ర లింగారెడ్డి, స్థానిక సర్పంచ్‌ గడ్డం నాగలక్ష్మి, తదితరులు ఉన్నారు.



ముకుందాపురంలో పారిశుద్ధ్య పనులను పరిశీలిస్తున్న ఎంపీడీఓ శంకరయ్య

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

నేరేడుచర్ల : ఇంటి పరిసరాలను యాజమానులు పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఎంపీడీఓ శంకరయ్య సూచించారు. శనివారం మండలంలోని కల్లూరు, ముకుందాపురం గ్రామాల్లో చేపడుతున్న పారిశుద్ధ్య పనులను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డ్రెయినేజీలను ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని సిబ్బందికి సూచించారు. ఆయన వెంట కల్లూరు గ్రామ సర్పంచ్‌ నాగరాజు, కార్యదర్శులు పద్మ, వెంకటేష్‌ తదితరులు ఉన్నారు.

ఎంపీ కోమటిరెడ్డి ఆర్థికసాయం

నాగారం : మండల పరిధిలోని పేరబోయినగూడెం బీఆర్‌ఎస్‌ పార్టీ మాజీ గ్రామ శాఖ అధ్యక్షుడు దొడ్డి కిరణ్‌ అనారోగ్యంతో బాధ పడుతుండటంతో స్థానిక కాంగ్రెస్‌ నాయకుడు భువనగిరి ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డికి విషయం తెలియజేశారు. దీంతో వెంటనే స్పందించిన ఆయన హైదరాబాద్‌లోని తన నివాసంలో బాధితుడి వైద్యఖర్చులకు శనివారం రూ.60,000 ఆర్థికసాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్‌పార్టీ నాయకులు ఈదుల రమేష్‌చంద్ర, జాజుల వీరయ్య, గండమల్ల లక్ష్మయ్య, చింతల యాకమల్లు, గండమల్ల లావణ్య, కార్తీక్‌, మద్దూరి భిక్షం పాల్గొన్నారు.

జూనియర్‌ ఎన్‌టీఆర్‌ జన్మదిన వేడుకలు

నేరేడుచర్ల : నేరేడుచర్లలో జూనియర్‌ ఎన్‌టీఆర్‌ జన్మదిన వేడుకలను శనివారం ఎన్‌టీఆర్‌ అభిమాన సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్‌ కట్‌ చేసి, పేదలకు మజ్జిగ పంపిణీ చేశారు. కార్యక్రమంలో జూనియర్‌ ఎన్‌టీఆర్‌ అభిమానులు పాల శ్రీను, భిక్షం, శేఖర్‌, వినోద్‌, వినయ్‌, సతీష్‌, శరత్‌ తదితరులు ఉన్నారు.



మజ్జిగ పంపిణీ చేస్తున్న ఎన్‌టీఆర్‌ అభిమానులు

పేదల కోసం పాటుపడిన వ్యక్తి సుందరయ్య

- మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి



సుందరయ్య వర్ధంతి కార్యక్రమంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి

నేరేడుచర్ల : పుచ్చలపల్లి సుందరయ్య వ్యక్తి కాదు ఒక శక్తి అని, ప్రపంచంలో గుర్తించబడిన 50 మంది నాయకుల్లో పుచ్చలపల్లి సుందరయ్య ఒకరని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి, సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యురాలు, ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి అన్నారు. శుక్రవారం రాత్రి మండలంలోని పెంచికల్‌దిన్నె గ్రామంలో కమ్యూనిస్టు నేత పుచ్చలపల్లి సుందరయ్య 38వ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. అనంతరం జరిగిన సభలో వారు మాట్లాడారు. సుందరయ్య భూస్వామ్య కుటుంబంలో పుట్టినప్పటికీ బడుగు, బలహీన వర్గాల పేదల కోసం పాటుపడటంతో పాటు తన చిన్న వయస్సు నుంచి వారి కష్టాలను చూసిన వ్యక్తి అని అన్నారు. తనకు ఉన్న ఆస్తులన్నీ పేదలకు పంచి పెట్టారని తెలిపారు. గ్రామస్థాయిలో పార్టీ నిర్మాణం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. సుందరయ్య స్ఫూర్తితో పార్టీ కార్యకర్తలు, యువత ముందుకు సాగాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై ఉద్యమించేందుకు సిద్ధం కావాలన్నారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు పారేపల్లి శేఖర్‌రావు, మండల పార్టీ కార్యదర్శి సిరికొండ శ్రీను, కోదమగుండ్ల నగేష్‌, కందగట్ల అనంత్‌ప్రకాశ్‌, శ్రీధర్‌, మర్రి నాగేశ్వర్‌రావు, రవి, రవణమ్మ, రాములమ్మ, మధు, నాగసైదులు, అప్పారావు, బాబురావు, సుంకరి వెంకటేశ్వర్‌రావు, మురళి, ప్రసాదరావు, పాతూరి శ్రీనివాస్‌రావు తదితరులున్నారు.

వైద్యసిబ్బంది అంకితభావంతో పనిచేయాలి



మాట్లాడుతున్న ఎంపీపీ గూడెపు శ్రీనివాస్‌

హుజూర్‌నగర్‌రూరల్‌ : వైద్యసిబ్బంది అంకితభావంతో పనిచేసి ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించాలని ఎంపీపీ గూడెపు శ్రీనివాస్‌ కోరారు. శనివారం మండల పరిధిలోని లింగగిరి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నిర్వహించిన జన ఆరోగ్య సమితి మండల స్థాయి సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ఉప కేంద్రాలు, హెల్త్‌ వెల్‌నెస్‌ సెంటర్లు, ఆస్పత్రులలో వైద్య సేవల తీరు, నిర్వహణ, మౌలిక వసతుల కల్పన తదితర అంశాలపై చర్చించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గతంలో హాస్పిటల్‌ డెవలప్‌మెంట్‌ సొసైటీలు (హెచ్‌డీఎస్‌)గా కొనసాగిన వాటిని ప్రస్తుతం జన ఆరోగ్య సమితిగా కమిటీలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రతి ఆరోగ్య కేంద్రంలో సిటిజన్‌ చార్ట్‌ తప్పనిసరిగా ప్రదర్శించాలని సూచించారు. నీటి వసతి, శానిటేషన్‌, పరిసరాల శుభ్రతపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. సమావేశంలో మండల వైద్యాధికారిణి డాక్టర్‌ సన, ఎంపీడీఓ శాంతకుమారి, ఎంఈఓ సైదానాయక్‌, డీటీ సుధారాణి, ఇన్‌చార్జ్‌ సీడీపీఓ హేమాదేవి, వెంకమ్మ, నూర్జహాన్‌, ప్రభాకర్‌, రామకృష్ణ, శ్రీనివాస్‌, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

కార్మికులకు అందని సంక్షేమ పథకాలు



సమావేశంలో పాల్గొన్న ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు నవీన్‌, నాయకులు

నేరేడుచర్ల : భవన, ఇతర నిర్మాణ కార్మికులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలుచేస్తున్న సంక్షేమ పథకాలు అందడం లేదని ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు కామళ్ల నవీన్‌ అన్నారు. శనివారం మండలంలోని ముకుందాపురం గ్రామంలో జరిగిన తెలంగాణ ప్రగతిశీల భవన, ఇతర నిర్మాణ కార్మిక సంఘం సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. వివిధ రంగాల్లో పనిచేస్తున్న కార్మికులకు ప్రభుత్వం గుర్తింపుకార్డులు ఇవ్వకపోవడం దురదృష్టకరమన్నారు. లేబర్‌ అధికారులు ఈ విషయంపై స్పందించి కార్మికులకు తక్షణమే గుర్తింపు కార్డులను అందించాలని డిమాండ్‌ చేశారు. అనంతరం గ్రామ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గ్రామ అధ్యక్షుడిగా బొమ్మకంటి వెంకన్న, ప్రధాన కార్యదర్శిగా పి.మట్టయ్య, ఉపాధ్యక్షుడిగా బొమ్మకంటి ఎల్లయ్య, సహాయ కార్యదర్శిగా మండలి నాగయ్య, కోశాధికారిగా కోల సైదులుతో పాటు సభ్యులుగా సుధాకర్‌, శ్రీను, మల్లేష్‌, జనార్దన్‌, సైదులు, జానులను ఎన్నుకున్నారు. సమావేశంలో నాయకులు శ్రీను, వినోద్‌, అంజయ్య, నరేష్‌ తదితరులు ఉన్నారు.

క్రీడలతో శారీరక, మానసిక శక్తి



క్రీడాకారులతో విద్యుత్‌ డీఈ వెంకటకిష్టయ్య, సుధాకర్‌రెడ్డి

హుజూర్‌నగర్‌ : క్రీడాకారులు ఏకాగ్రత, నిబద్ధతతో ఆటలు నేర్చుకోవాలని విద్యుత్‌ డీఈ వెంకటకిష్టయ్య అన్నారు. పట్టణంలోని వీవీఎం స్కూల్‌లో శాంతిరెడ్డి ఫౌండేషన్‌ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వాలీబాల్‌, కబడ్డీ, అథ్లెటిక్స్‌ ఉచిత వేసవి శిక్షణ శిబిరాన్ని శనివారం ఆయన సందర్శించి క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలతో శారీరక, మానసిక శక్తి పొందవచ్చని తెలిపారు. క్రీడాకారులు ఎంత పెద్ద సమస్యను అయినా ఎదుర్కొని నిలబడగలరని, వారికి మానసిక స్థైర్యం ఎక్కువగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో శాంతిరెడ్డి ఫౌండేషన్‌ వ్యవస్థాపకులు సుధాకర్‌రెడ్డి, రమేష్‌, పీడీలు, పీఈటీలు, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

బాస్కెట్‌ బాల్‌ పోటీలు ప్రారంభం



బాస్కెట్‌బాల్‌ క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న పుట్టా కిషోర్‌

సూర్యాపేటటౌన్‌ : మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి సారథ్యంలో సూర్యాపేట క్రీడా హబ్‌గా మారనుందని మున్సిపల్‌ వైస్‌ చైర్మన్‌, బాస్కెట్‌ బాల్‌ జిల్లా ఉపాధ్యక్షుడు పుట్టా కిషోర్‌ అన్నారు. బాస్కెట్‌ బాల్‌ అసోసియేషన్‌ జిల్లా అధ్యక్షుడు, తుంగతుర్తి ఎమ్మెల్యే గాదరి కిశోర్‌ ఆదేశానుసారం శనివారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్‌ కళాశాలలో అసోసియేషన్‌ జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్‌ ఫరూక్‌ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జిల్లా స్థాయి అండర్‌ 16 బాస్కెట్‌ బాల్‌ సెలక్షన్‌ పోటీలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఈ సెలక్షన్లలో ఎంపికయ్యే క్రీడాకారులు ఈ నెల 25, 26, 27 తేదీల్లో సూర్యాపేట జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్‌ కళాశాలలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనేందుకు అవకాశం లభిస్తుందన్నారు. బాస్కెట్‌ బాల్‌ అసోసియేషన్‌ జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్‌ ఫరూక్‌ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో దేవరాజ్‌, మంత్రి శ్రీను, ఇసాక్‌, అర్జున్‌, వినయ్‌ తదితరులు పాల్గొన్నారు.

దారికి అడ్డంగా.. దర్జాగా వ్యాపారం

- పాత ఎంపీడీఓ కార్యాలయం గేటుకు ఎదురుగా దారి ఆక్రమణ
- ఇబ్బందులు పడుతున్న నీటిపారుదల శాఖ అధికారులు



పాత ఎంపీడీఓ కార్యాలయం గేటు ఎదుట వ్యాపారులు పెట్టిన తోపుడు బండ్లు, వాహనాలు

కోదాడరూరల్‌ : ఇసుంట రమ్మంటే ఇల్లంతా నాదన్నట్టుంది పాత ఎంపీడీఓ కార్యాలయం గేటు పక్కన వ్యాపారం చేసుకుంటున్న వ్యక్తులది. అక్రమంగా షాపులు ఏర్పాటు చేసుకొని వ్యాపారం చేసుకుంటున్న వారు.. ఏకంగా ఎంపీడీఓ కార్యాలయంలోకి వెళ్లే దారినే ఆక్రమించారు. కార్యాలయ గేటుకు ఇరువైపులా తోపుడు బండ్లు, వారి వాహనాలు పెట్టి నీటిపారుదల శాఖ అధికారులకు, ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తున్నారు.

హెచ్చరించినా యథావిధిగా..

కాగా, కోదాడ పట్టణ నడిబొడ్డులో ఎంపీడీఓ కార్యాలయం ఉండేది. అది శిథిలావస్థకు చేరడంతో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం పక్కన నూతన భవనం నిర్మించడంతో మూడేళ్ల కిందట ఎంపీడీఓ కార్యాలయాన్ని అక్కడకు మార్చారు. దీంతో ఆ పాత కార్యాలయం కాళీగానే ఉంటుంది. అయితే కోదాడలోని నీటి పారుదల శాఖ కార్యాలయం పూర్తిగా శిథిలావస్థకు చేరడంతో ఆ కార్యాలయాన్ని పాత ఎంపీడీఓ కార్యాలయంలోకి మార్చారు. అయితే ఎంపీడీఓ కార్యాలయం గేటు పక్కనే ప్రహరీని ఆనుకొని ఉన్న స్థలాన్ని కొందరు గతంలో అక్రమించుకొని వ్యాపారం చేస్తున్నారు. మండల పరిషత్‌ అధికారులు అక్కడి విధులు నిర్వహించినంత కాలం వ్యాపారులు దారికి ఇబ్బంది లేకుండా జాగ్రత్త పడుతూ వ్యాపారం చేసుకునేవారు. ఎప్పుడైతే కార్యాలయం అక్కడి నుంచి తరలించారో వ్యాపారులు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారు. కొందరైతే ఏకంగా బాటలో ఓ డబ్బా కొట్టును పర్మినెంట్‌గా ఏర్పాటు చేయగా నాడు ఆక్రమణపై సాక్షిలో కథనం రావడంతో స్పందించిన అధికారులు ఆ డబ్బా కొట్టును తొలగించారు. కానీ ప్రస్తుతం కార్యాలయంలోకి వెళ్లే దారిలో గేటుకు అడ్డంగా తోపుడు బండ్లు, వారి సొంత వాహనాలను పెట్టి కార్యాలయానికి వచ్చే అధికారులకు, ఇతర పనులపై వస్తున్న ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తున్నారు. చెప్పినప్పుడు తీస్తున్నారని ఆ తర్వాత యథావిధిగా మళ్లీ పెడుతున్నారని అధికారులు అంటున్నారు. ఇటీవల కాలంలో చెప్పినా పట్టించుకోవడంలేదని వారు తెలిపారు. సంబంధిత అధికారులు స్పందించి దారికి అడ్డంగా తోపుడు బండ్లు, వాహనాలు పెట్టే వ్యాపారులపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.